సాక్షి
నంద్యాల
బుధవారం, 2, అక్టోబర్, 2024



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరుడికి, శ్రీశైలక్షేత్రపాలకుడు బయలువీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.



ఆగని విధ్వంసం

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో శిలాఫలకాల విధ్వంసం సాగుతోంది. తాజాగా పేరాయిపల్లెలో దుండగులు రెండింటిని ధ్వంసం చేశారు. పోలీసులు, అధికారులు చోద్యం చూస్తున్నారు. 10లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1,633
ప్రస్తుతం	:1,631.92
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:101.125
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:8,277
అవుట్ ఫ్లో	:10,177

న్యూస్‌రీల్

వీరభద్రస్వామికి వెండి కిరీటం సమర్పణ



వెండి కిరీటం, పళ్లెమును దేవస్థానానికి బహుకరిస్తున్న దాత డి.పుల్లయ్య

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి శ్రీశైలం కొత్తపేటకు చెందిన డి.పుల్లయ్య మంగళవారం 800 గ్రాముల బరువు ఉన్న వెండి కిరీటం, 290 గ్రాముల బరువు ఉన్న వెండి పళ్లెమును సమర్పించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో వెండి వస్తువులను అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు ఎం.ఉమానాగేశ్వరశాస్త్రి, పర్యవేక్షకులు అయ్యన్నకు అందజేశారు. వేద పండితులు దాతను వేదాశీర్వచనం చేసి, స్వామిఅమ్మవార్ల శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు.

త్వరలో పత్తి కొనుగోలు కేంద్రాలు

నంద్యాల(రూరల్): జిల్లాలో త్వరలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు నంద్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఎగువ శ్రేణి కార్యదర్శి కల్పనా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) 2024–25 సీజన్‌లో రైతులు పండించిన పత్తి దిగుబడులను క్వింటా(పొడవు గింజ) రూ.7,521, పొట్టి గింజ రూ.7,121 చొప్పున కనీస మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందన్నారు. ఇందుకోసం నంద్యాల పట్టణంలో జిన్నింగ్ మిల్లులలో అతిత్వరలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు.

దసరా మహోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఈఓ పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో శ్రీభ్రమరాంబాదేవి శరన్నవరాత్రోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు తెలిపారు. మంగళవారం దేవస్థాన పరిపాలనా భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో దసరా నవరాత్రోత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో శ్రీస్వామిఅమ్మవార్లకు జరిపించాల్సిన ఆయా కైంకర్యాలు, అలంకరణ, వాహనసేవలు, వాహనాల పార్కింగ్, దర్శనం ఏర్పాట్లు సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లు మొదలైన అంశాల గురించి వివరించారు. ఉత్సవాల సందర్భంగా ఈ నెల 11వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం చే స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తారన్నారు. ఈ నెల 12వ తేదీన యాగపూర్ణాహుతి, కళశోధ్వాసన, అవభృదం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అదే రోజు సాయంత్రం తెప్పోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని అన్నారు.

తమ్ముళ్ల పాలసీ సపరేటు

- మద్యం దుకాణాల్లో వాటా కోసం అధికార పార్టీ నేతల యత్నం
- లైసెన్స్ ఎవరికి వచ్చినా వాటా ఇవ్వాల్సిందంటూ నేతల హుకుం
- దుకాణ దరఖాస్తుదారులను హెచ్చరిస్తున్న తమ్ముళ్లు
- ముందుగానే బెల్ట్‌షాప్‌లకు హామీ ఇచ్చేస్తున్న వైనం

ప్రైవేటు మద్యం షాపులకు ప్రభుత్వం తలుపులు బార్లా తెరిచేసింది. దోచుకున్నోడికి దోచుకున్నంతలా నూతన మద్యం పాలసీని రూపొందించింది. రెండేళ్ల కాలపరిమితితో నూతన లిక్కర్ పాలసీ విధానాన్ని ఖరారు చేసింది. అయితే దుకాణాల ప్రారంభానికి 12 రోజుల సమయం ఉన్నా తెలుగు తమ్ముళ్లు ముందే దుకాణం తెరిచేశారు. దుకాణాల్లో వాటా కోసం అధికార పార్టీ నేతలు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. 'మద్యం వ్యాపారం చేయాలనుకుంటున్నారా.. అయితే మేము చెప్పినట్లు వినాల్సిందే.. మా వాటా మాకు ఇవ్వాల్సిందే' అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు.



సాక్షి, నంద్యాల: కూటమి కిక్కుకు తెలుగు తమ్ముళ్లు సిద్ధమయ్యారు. లిక్కర్ దందాకు తెరలేపుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో మందుబాబులను దోచుకున్నట్లుగానే ఇప్పుడూ దోచుకోవాలని పావులు కదిపారు. లిక్కర్ వ్యాపారంలో ఆరితేరిన వారితో కలసి పకడ్బందీగా దోపిడీకి సిద్ధమవుతున్నారు. జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కావడంతో ఎక్కడెక్కడ ప్రైవేటు మద్యం దుకాణం వస్తోంది, ఏ దుకాణానికి ఎవరు దరఖాస్తు చేయాలి, చెప్పినట్టుగానే దరఖాస్తు పడాలి, లాటరీలో అనుకున్నవారే ఉండాలి, లాటరీలో వచ్చిన దుకాణాన్ని ఎవరు నడపాలి, దాంట్లో ఎవరిని సిండికేట్‌గా ఉంచాలి తదితర అంశాలతో రంగం సిద్ధం చేసేశారు. నంద్యాల జిల్లాలో 105 మద్యం దుకాణాలకు మంగళవారం నోటిఫికేషన్ విడుదల కావడంతో తమ్ముళ్లు తమ పనిని ముమ్మరం చేశారు. ఈనెల 12వ తేదీ నుంచి 2026 సెప్టెంబర్ 30 వరకూ ఈ విధానం అమలులో ఉండనుండటంతో రెండేళ్లలో లిక్కర్ దందా మాటున వీలైనంత వరకు దోచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా పెట్టుకోవచ్చనే వెసులుబాటు ఉండడంతో జిల్లా నాయకులు ఇక్కడే కాకుండా ఇతర జిల్లాలో డిమాండ్ ఉన్న ప్రాంతాల్లోనూ దుకాణాలు దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. మరోవైపు తమ నియోజకవర్గాల్లో ఇతర ప్రాంతాల వారు దరఖాస్తు చేసుకుంటే ఇబ్బంది పడాల్సి వస్తుందని బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ రంగంలో ఆరితేరిన వారంతా మద్యం దుకాణాల వ్యవహారం తమ గుప్పిట్లో ఉండేలా లాబీయింగ్ చేస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలు, మంత్రులు తమ చేతికి మట్టి అంటకుండా సాఫీగా పని పూర్తి చేయాలని అనుయాయులను ఇప్పటికే పురమాయించినట్లు తెలుస్తోంది. నూతన మద్యం పాలసీలో భాగంగా అధికార పార్టీ ఎమ్మెల్యేల ఒత్తిడి మేరకు ప్రభుత్వం మద్యం షాపులను ప్రస్తుతానికి 10 శాతం మేర పెంచింది. జిల్లాలో కొంతమంది ఎమ్మెల్యేలు తమ పలుకుబడిని ఉపయోగించుకుని గతంలో కంటే షాపులను భారీగా పెంచుకుంటున్నారు. శ్రీశైలం నియోజకవర్గంలో గతంలో ఉన్న షాపుల కంటే రెట్టింపు షాపులు వచ్చాయి. ప్రస్తుతం ఇక్కడ 9 షాపులుంటే ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో ఈ సంఖ్య 17కి చేరింది. నందికొట్కూరులో ప్రస్తుతం 7 నుంచి 12కి, డోన్‌లో 12 నుంచి 16కి పెరిగాయి. ఆళ్లగడ్డలో పాత వాటినే కొనసాగించనున్నారు. నంద్యాలలో ప్రస్తుతం 22 షాపులుంటే కొత్త గెజిట్‌లో ఆ సంఖ్యను 17కి తగ్గించడం గమనార్హం. బనగానపల్లెలో 21 షాపులకు నోటిఫికేషన్ విడుదలైంది.

జిల్లాలో మద్యం దుకాణాలు 105

లైసెన్స్ రుసుముల స్లాబ్ వివరాలు...

జనాభా	లైసెన్స్ రుసుము (రూ.లక్షల్లో)
10 వేల లోపు	రూ.50 లక్షలు
10 వేల నుంచి 50 వేల వరకు	రూ.55 లక్షలు
50,001 నుంచి 5,00,000 వరకు	రూ.65 లక్షలు
5 లక్షలకు పైన	రూ.85 లక్షలు

నియోజక వర్గాల వారీగా కొత్త మద్యం దుకాణాల వివరాలు

నంద్యాల	17
శ్రీశైలం	17
బనగానపల్లె	21
డోన్	16
నందికొట్కూర్	12
ఆళ్లగడ్డ	18
పాణ్యం, గడివేముల	4
మొత్తం	105

మీ వ్యాపారం.. మా వాటా..

పాత పద్ధతిలోనే తిరిగి మద్యం విధానం అమలులోకి రావడంతో అధికారంలో పట్టున్న నేతలంతా సిండికేట్‌గా మారి మద్యం దుకాణాల్లో వాటా ఉండేలా జాగ్రత్త పడుతున్నారు. నంద్యాల, పాణ్యం, గడివేముల, డోన్ ప్రాంతాల్లోని మద్యం దుకాణాలకు డిమాండ్ ఎక్కువగా కనిపిస్తోంది. వైన్ షాపులకు పర్మిట్ రూంలను కూడా ప్రభుత్వం ఇచ్చే అవకాశం ఉండడంతో ఎలాగైనా దుకాణాలను దక్కించుకునేందుకు ఆశావహులు ప్రయత్నిస్తున్నారు. ఆదాయం భారీగా వస్తుందనుకున్న ప్రాంతాల్లోని దుకాణాలను దక్కించుకునేందుకు టీడీపీ నాయకులే ఒక సిండికేట్‌గా మారి ఇతరులెవరూ దరఖాస్తు చేయకుండా నిలువరించే ప్రయత్నాలు మొదలయ్యాయి. మరికొందరైతే దరఖాస్తు చేసి దుకాణాలు దక్కించుకునే బదులు దుకాణం వచ్చిన వారి దగ్గర నుంచి వాటా కోసం ప్రయత్నిస్తున్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని మద్యం దుకాణాలు ఎవరికి వచ్చినా తమ వాటా ఇవ్వాల్సిందేనని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఇప్పటికే స్పష్టం చేశారు. శ్రీశైలం, పాణ్యం, డోన్ నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. నంద్యాల, బనగానపల్లెలో మాత్రం ప్రజాప్రతినిధులు సీన్‌లోకి ప్రవేశించకుండా వారి అనుచరుల ద్వారా పర్సంటేజ్ అడిగిస్తున్నారు. మామూళ్లు ముట్టజెప్పితే బెల్ట్ షాపులతో పాటు ఎనీ టైం మందు అమ్ముకునేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇస్తున్నారు.

రోజుకు సరాసరిగా రూ.2.25 కోట్ల మేర విక్రయాలు

2019 సెప్టెంబర్ నాటికి జిల్లాలో 110 మద్యం దుకాణాలు ఉండేవి. అయితే వీటి సంఖ్యను దశలవారీగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తగ్గించుకుంటూ వెళ్లింది. ప్రస్తుతం 97 దుకాణాలున్నాయి. వీటి పరిధిలో ప్రతీ రోజు సుమారుగా రూ.2 కోట్ల నుంచి 2.25 కోట్ల వరకు లిక్కర్ విక్రయాలు జరుగుతున్నాయి. ఆదివారం, పండుగ రోజుల్లో రూ.2.5 కోట్ల వరకు మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనే ఈ మేరకు విక్రయాలు సాగితే ఇక ప్రైవేటుకు అప్పగిస్తే రోజుకు రూ.3 కోట్ల నుంచి రూ.3.25 కోట్లకు విక్రయాలు పెరిగే అవకాశం ఉంది. దీంతో లైసెన్స్ ఫీజును మొదటి ఏడాదిలోనే రాబట్టుకోవచ్చనే ఆలోచనలో ఆశావహులు ఉన్నారు. రెండో దశలో ఐదు దుకాణాలను గీత కార్మికులకు కేటాయించనుంది. జిల్లా కేంద్రంతో పాటు నియోజకవర్గాల్లో జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల కంటే శివారు ప్రాంతాల దుకాణాల వైపు ఎక్కువ మంది దరఖాస్తుదారులు మొగ్గు చూపిస్తున్నారు. ఊరి చివర దుకాణం నిర్వహిస్తే నిబంధనల వెలుసుబాటు ఉంటుందని సమయం గడిచిన తర్వాత కూడా అనధికారికంగా స్వేచ్ఛగా విక్రయాలు జరుపుకోవచ్చని లిక్కర్ వ్యాపారులు చెబుతున్నారు.

105 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్

- 9 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 11న లాటరీ ద్వారా దుకాణాల కేటాయింపు
- 12 నుంచి అందుబాటులోకి కొత్త దుకాణాలు



మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లాలో మొత్తం 105 మద్యం దుకాణాలకు సంబంధించి ప్రైవేటు వ్యక్తులు కొనసాగించుకునేందుకు లైసెన్స్ ప్రక్రియను మంగళవారం నుంచి ప్రారంభించినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కొత్త మద్యం పాలసీ ప్రకారం దుకాణాలకు లైసెన్స్ పొందేందుకు విధి విధానాలను వివరించారు. ఈనెల 12వ తేదీ నుంచి 2026 సెప్టెంబర్ 30వ తేదీ వరకు రెండేళ్ల కాలపరిమితితో దుకాణాల కేటాయింపు జరుగుతుందన్నారు. మంగళవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంటుందన్నారు. ఒక్కో దరఖాస్తుకు రూ. 2 లక్షల నాన్ రీఫండబుల్ రుసుం చెల్లించాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను అందుబాటులో ఉంచామని, ఆఫ్‌లైన్‌లో చేసుకునేందుకు జిల్లాలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ల వద్ద ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. దరఖాస్తు రుసుము చెల్లించేందుకు ఆన్‌లైన్ ద్వారా వీలు కాకపోతే పోలీస్‌స్టేషన్‌లలో ప్రత్యేకంగా బ్యాంక్ సిబ్బందితో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో నగదు చెల్లించవచ్చన్నారు. అప్లికేషన్ పూర్తి చేయాలనుకునే వారు నేరుగా స్టేషన్ వద్దకు వెళ్లి అక్కడ ఉన్న సిబ్బంది సహాయం తీసుకునే అవకాశం కల్పించామన్నారు. ఈనెల 11వ తేదీ ఉదయం 8 గంటలకు స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో లాటరీ పద్ధతిలో అధికారులు నూతన మద్యం దుకాణాలను కేటాయించనున్నారు.

రెడ్ క్రాస్ బలోపేతానికి కృషి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో కొత్తగా ఏర్పాటైన రెడ్ క్రాస్ సంస్థను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సంస్థ ప్రెసిడెంట్ రాజకుమారి అన్నారు. మంగళవారం రామకృష్ణ పీజీ కళాశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల ఆధ్వర్యంలో రక్తదాన రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. 60 మంది విద్యార్థులు రక్తదానం చేయడం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సహకారంతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రక్తదాతలకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రసంశా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఎన్‌సీసీ కమాండెంట్ అరవింద్ సింగ్, రెడ్ క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ మారుతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం డ్యాం నీటిమట్టం 880.80 అడుగులు

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం డ్యాం నీటిమట్టం మంగళవారం సాయంత్రం సమయానికి 880.80 అడుగులకు చేరుకుంది. జలాశయంలో 192.5300 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ జూరాల, సుంకేసుల నుంచి 90,217 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుంది. సోమవారం నుంచి మంగళవారం వరకు ఎగువ ప్రాజెక్ట్‌ల నుంచి 71,485 క్యూసెక్కుల నీరు వచ్చి చేరగా, జలాశయం నుంచి దిగువ ప్రాజెక్ట్‌లకు 61,260 క్యూసెక్కుల నీరు విడుదలైంది. కుడిగట్టు కేంద్రంలో 5.679 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 15.941 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.

ఇంటిదగ్గర పింఛన్ల పంపిణీ ఒట్టిదే!

- నంద్యాల జిల్లాలో 97.42 శాతం పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): ఇంటి దగ్గరే పింఛన్ల పంపిణీ మాటలకే పరిమితమవుతోంది. అధికారుల హడావుడి తప్ప ఆచరణలో కనిపించడం లేదు. ఈసారి కూడా 20 నుంచి 30 శాతం వరకే ఇంటి దగ్గర పెన్షన్ పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. కొందరు సచివాలయ ఉద్యోగులు ఉదయం కొద్ది సేపు ఇంటి దగ్గరకే వెళ్లి పంపిణీ చేసినా.. తర్వాత అందరిని ఒకేచోట పిలిపించి పంపిణీ చేపట్టారు. దీంతో అవ్వాతాతలు, దివ్యాంగులు అతి కష్టం మీద పింఛన్లు ఎక్కడ పంపిణీ చేస్తున్నారో తెలుసుకొని అక్కడికి వెళ్లి తెచ్చుకోవాల్సి వచ్చింది. అక్టోబరు నెల పింఛన్ల పంపిణీలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. పత్తికొండ మండలం పుచ్చకాయలమాడ గ్రామంలో రెండు, మూడు ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. మంగళవారం సాయంత్రం 6 గంటల సమయానికి కర్నూలు జిల్లాలో 98.04 శాతం జరిగినట్లు అధికారులు ప్రకటించారు. నంద్యాల జిల్లాలో 2,18,225 పింఛన్‌దారులుండగా 2,12,605 మందికి (97.42 శాతం) పంపిణీ చేశారు. వివిధ కారణాలతో మిగిలిపోయిన వారికి నేడు పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

కేడీసీసీ బ్యాంకు శాఖల్లో గందరగోళం

- విస్తుగొలుపుతున్న ఉద్యోగుల అడ్డగోలు వ్యవహారం
- ఆత్మకూరు బ్రాంచ్‌లో రూ.80లక్షలు కొట్టేసిన క్యాషియర్
- మళ్లించిన డబ్బు షేర్ మార్కెట్‌లో పెట్టుబడి
- గతంలో ఆదోని బ్రాంచ్‌లోనూ రూ.70లక్షల స్వాహా
- చర్యలు తీసుకునే విషయంలో అధికారుల మీనమేషాలు
- పెరిగిపోతున్న నిరర్థక ఆస్తులు

ఇంటిదొంగల 'సహకారం'

కర్నూలు(అగ్రికల్చర్): ఇది నా బ్యాంకు.. ఇది బాగుంటేనే నేను బాగుంటా.. బ్యాంకు అభివృద్ధికి దోహదపడాలనే తపన ప్రతి ఉద్యోగిలో ఉండాలి.. అప్పుడే బ్యాంకు ప్రగతి పథంలోకి వస్తుంది. ఖాతాదారుల్లో నమ్మకం పెరిగినప్పుడే ఆ బ్యాంకు కలకాలం నిలుస్తుంది, ఉద్యోగులకు నీడనిస్తుంది. అయితే ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పరువును ఉద్యోగులే బజారున పడేస్తున్నారు. దీపం ఉన్నప్పుడే ఇళ్లు చక్కబెట్టుకోవాలన్న చందంగా.. అవకాశం ఉన్నప్పుడే డబ్బులు మూట కట్టుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. సొంత సిబ్బందే వందేళ్ల చరిత్ర ఉన్న బ్యాంకు పరువును గంగలో కలిపేస్తుండటం చర్చనీయాంశమవుతోంది. సాధారణంగా ఎవ్వరైనా పదవీ విరమణ సమయంలో ప్రశాంతంగా ఉండాలని కోరుకుంటారు. కానీ జిల్లా సహకార కేంద్రబ్యాంకులో మాత్రం పదవీ విరమణ ముందు సంపాదన కోసం రాజకీయ నాయకుల సిపారసులతో బ్రాంచీలకు వెళ్తుండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇటీవల హెడ్ ఆఫీసు బ్రాంచ్‌లో పనిచేసి ఓ అధికారి సంపాదన లక్ష్యంగా టీడీపీ నేతల సిపారసుతో కర్నూలుకు సమీపంలోని బ్రాంచ్‌కు వెళ్లినట్లు తెలుస్తోంది. 2024–25 సంవత్సరంలో దీర్ఘకాలిక రుణాలు, స్వల్పకాలిక రుణాల పంపిణీకి రూ.330 కోట్ల బడ్జెట్ బ్రాంచీలకు, పీఏసీఎస్‌లకు ఇచ్చారు. అయితే రుణాల పంపిణీ ద్వారా భారీగా కమీషన్‌లు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రుణం పొందడానికి కమీషన్‌లు, రుణం మంజూరు కావడానికి వెరిఫికేషన్‌కు వెళ్లే కొందరు అధికారులు ముడుపులు ముట్టనిదే కదలనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తాజా ఆర్థిక సంవత్సరంలో రుణాల పంపిణీకి బడ్జెట్ కేటాయించినా కమీషన్‌ల గోల కారణంగా రైతులు తీసుకోవడానికి ముందుకు రావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పథకం ప్రకారం నిధుల మళ్లింపు



ఆత్మకూరు బ్రాంచీలో అల్తాఫ్ క్యాషియర్‌గా పనిచేస్తున్నారు. పాసింగ్ ఆఫీసర్‌గా రంగయ్య ఉన్నారు. ప్రధాన కార్యాలయం నుంచి వచ్చే నిధులపై వీరిద్దరి జాయింట్ కస్టడీ ఉంటుంది. మేనేజర్ పులిరాజు పర్యవేక్షణ 100 శాతం ఉండాలి. అన్నింటికీ బాధ్యత వహించాల్సిన మేనేజర్ చూసీచూడనట్లు వ్యవహరిస్తూ నిధుల మళ్లింపునకు సహకరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ.100 నోట్లు కట్టకడితే రూ.10 వేలు అవుతుంది. క్యాషియర్ రూ.10 వేల నోట్ల కట్టకు పైన ఒకటి, కింద ఒకటి రూ.500 నోటు పెట్టి రూ.50 వేల కట్టగా నమ్మించారు. రూ.49 వేలు స్వాహా చేశారు. ఈ ప్రక్రియ నెల రోజుల పాటు నిరంతరాయంగా సాగింది. మొత్తం రూ.80 లక్షలు సొంత ఖాతాకు మళ్లించిన క్యాషియర్ షేర్ మార్కెట్‌లో పెట్టుబడిగా పెట్టినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో తేరుకున్న అధికారులు క్యాషియర్ అల్తాఫ్, పాసింగ్ ఆఫీసర్ రంగయ్యను సస్పెండ్ చేయగా.. మేనేజర్‌కు మెమో జారీ చేశారు.

గతంలో ఆదోని బ్రాంచీలో రూ.70 లక్షల స్వాహా



ఆదోని బ్రాంచీలోనూ ఐదేళ్ల క్రితం మేనేజర్ దాదాపు రూ.70 లక్షలు మళ్లించాడు. దీర్ఘకాలిక రుణాలు, కర్షక జ్యోతి వంటి పథకాల కింద రైతులు దరఖాస్తు చేసుకోగా వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేసి రుణం మంజూరు చేశారు. అయితే ఆ తర్వాత రైతుల దరఖాస్తు తిరస్కరణకు గురైందని చెప్పి గుట్టుచప్పుడు కాకుండా నిధులను తన ఖాతాకు మళ్లించుకున్నారు. కొంతమంది రైతులకు తెలియకుండా నకిలీ పట్టాదారు పాసుపుస్తకాలతో దీర్ఘకాలిక రుణాలు తీసుకున్నారు. తర్వాతి కాలంలో రైతులకు నోటీసులు వెళ్లడంతో మేనేజర్ బాగోతం వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో అధికారులు ఆ నిధులను రికవరీ చేసి ఆయనకు అసిస్టెంటు మేనేజర్‌గా రివర్షన్ ఇచ్చి మరో బ్రాంచ్‌లో కొనసాగించడం గమనార్హం.

మరణించిన వ్యక్తికి రుణం

ఆదోని బ్రాంచ్‌లో మేనేజర్‌గా పని చేస్తున్న వ్యక్తి 2015లో మరణించిన వ్యక్తికి 2018లో కర్షక జ్యోతి పథకం కిందరూ.15లక్షల రుణం మంజూరు చేయడం అప్పట్లో కలకలం రేపింది. ఈ అక్రమం అంతటితో ఆగలేదు, ఆ రుణాన్ని రెన్యూవల్ కూడా చేయడం బ్యాంకులోని లోపాలను ఎత్తిచూపింది.

.. ఇలాంటి అవినీతి, అక్రమాలు వెలుగులోకి వచ్చినప్పుడే అధికారుల బాగోతం బట్టబయలు అవుతోంది. అయితే కొన్నింటిని ఉన్నతాధికారులు తొక్కిపెడుతున్నట్లుగా కూడా చర్చ జరుగుతోంది. కంచే చేను మేస్తున్న తీరుతో కేడీసీసీ బ్యాంకు ప్రతిష్ట మసకబారుతోంది.

బ్యాంకు ప్రగతికి రెవెన్యూ అడ్డంకి

జిల్లా సహకార కేంద్రబ్యాంకు నష్టపోవడానికి రెవెన్యూ కూడా ఒక కారణమవుతోంది. డోన్ మండలానికి చెందిన సంజీవుడి అనే వ్యక్తికి ఒక సర్వే నెంబర్‌లో భూములు ఉన్నట్లు వెబ్‌ల్యాండ్‌లో చూపారు. రుణం మంజూరు అయ్యేంత వరకు వెబ్‌ల్యాండ్‌లో సదురు వ్యక్తి పేరుతో భూములు ఉన్నట్లు చూపించారు. ఈ భూమిపై కర్షక జ్యోతి కింద పత్తికొండ బ్రాంచ్ ద్వారా రూ.10 లక్షలు రుణం పొందారు. నగదు చేతికి వచ్చిన వెంటనే వెబ్‌ల్యాండ్‌లో సమూలంగా మార్పులు చేశారు. దళారీ రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై రుణం పేరుతో నిధులు కొల్లగొట్టారు. ఈ నిధులు రికవరీ కాకపోవడంతో నోటీసులు ఇచ్చేందుకు వెబ్‌ల్యాండ్‌ను పరిశీలిస్తే సదురు వ్యక్తి పేరుతో భూమి లేకపోవడంతో విస్తుపోయారు. పోలీసు కేసు పెట్టినా.. జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఈ విషయంలో ఫలితం లేకపోయింది.

పెరిగిపోతున్న ఎన్‌పీఏ

అధికారుల అవినీతి కారణంగానే జిల్లా సహకార కేంద్రబ్యాంకు నిరర్థక ఆస్తులు(ఎన్‌పీఏ) పెరిగిపోతున్నాయి. రూ.15 లక్షల రుణం పొందాలంటే రూ.లక్ష వరకు ముడుపుల కిందనే ఇచ్చుకోవాల్సి ఉంటోంది. అప్పు ఎక్కువగా చూపడటం, చేతికి తక్కువగా వస్తుండటం.. ఇది రికవరీపై ప్రభావం పడుతోంది. 2024 మార్చి 31 నాటికి జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు రూ.195 కోట్ల మేర నిరర్థక ఆస్తులు ఉన్నట్లు తెలుస్తోంది.

పోలీసు కేసు పెడతాం



ఆత్మకూరు బ్రాంచ్‌లో రూ.80 లక్షల కుంభకోణానికి సంబంధించి ఇప్పటికే క్యాషియర్‌ను, పాసింగ్ అధికారిని సస్పెండ్ చేశాం. మేనేజర్ పులిరాజుకు కూడా మెమో ఇస్తున్నాం. నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ చేపడతాం. ఆ తర్వాత పోలీసు కేసు పెడుతాం. అక్రమాలను ఎలాంటి పరిస్థితుల్లో సహించబోం.

– విజయకుమార్, సీఈఓ, ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు

టెట్‌కు సర్వం సిద్ధం

- మూడు కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- పరీక్షకు హాజరుకానున్న 8,870 మంది అభ్యర్థులు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 3వ తేదీ నుంచి 21వ తేదీ వరకు నిర్వహించే టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)కు జిల్లాలో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్, శాంతిరాం ఇంజినీరింగ్, ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కాలేజీల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన 8,870 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారు. ఉదయం సెషన్‌ను 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్‌ను 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడంలో భాగంగా ఎంఈఓ స్థాయి అధికారిని డిపార్ట్‌మెంటల్ అధికారిగా, డీవైఈఓ స్థాయి అధికారితో స్క్వాడ్‌ను నియమించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఫొటో లేని హాల్ టికెట్లతో వచ్చే అభ్యర్థులను పరీక్ష కేంద్రం వద్ద ఫొటోతో కూడిన గుర్తింపు కార్డు, తాజా ఫొటోను పరిశీలించి అనుమతిస్తారు. దివ్యాంగులకు అదనంగా 50 నిమిషాల సమయం కేటాయిస్తారు. పరీక్షల నిర్వహణలో అనుమానాల నివృత్తికి ఉదయం 7.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సిబ్బంది అందుబాటులో ఉంటారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు.

నిష్ఠతో దీక్ష.. మల్లేశ్వరుడి రక్ష!

● మాళ మల్లేశ్వరస్వామిపై భక్తిని చాటుకుంటున్న నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులు
● ఈనెల 7 నుంచి 16 వ తేది వరకు దేవరగట్టు ఉత్సవాలు
● నేటి నుంచి 15 రోజుల పాటు కఠోర దీక్షలు చేపట్టనున్న గ్రామస్తులు



నెరణికి గ్రామం ఏరియల్ వ్యూ, కర్రల సమరంలో పల్లకీ, విగ్రహాలకు రక్షణగా ఉంటూ ముందుకు తీసుకెళ్తున్న భక్తులు (ఫైల్)

హొళగుంద: దసరా పండుగ అంటే దేవరగట్టు ఉత్సవాలు గుర్తుకు వస్తాయి. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ చాలా విభిన్నంగా వేడుకలు జరుగుతాయి. హొళగుంద మండలం నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులు ఐక్యంగా ఉంటూ విజయదశమి రోజు కర్రల సమరంలో పాల్గొంటారు. అయితే, ఈ వేడుకల్లో పాల్గొనే ప్రజలు చాలా నిష్ఠతో 15 రోజులు దీక్ష చేపట్టి మాళమల్లేశ్వరస్వామిని కొలుస్తారు. ఈనెల 7 నుంచి బన్ని ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆ గ్రామాల ప్రజలు నేటి నుంచి దీక్షలు చేపట్టి స్వామిపై భక్తిని చాటుకోనున్నారు.

చెప్పులు తొడగరు...మాంసం ముట్టరు

దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి దసరా బన్ని మహోత్సవాల్లో నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులదే కీలక భూమిక. వీరు స్వామిపై భక్తితో దీక్ష సమయంలో కఠిన కట్టుబాట్లను పాటిస్తారు. అమావాస్య రోజు నుంచి దీక్ష మొదలు పెట్టి బన్ని ఉత్సవాలు ముగిసే వరకు అంటే పక్షం రోజుల పాటు కొనసాగిస్తారు. ఈ సమయంలో చెప్పులు వేసుకోరు. మద్యం, మాంసం ముట్టుకోరు. దంపతులు దూరంగా ఉంటారు. బన్ని రోజు ఉత్సవంలో పాల్గొని అన్నదమ్ముల్లా కలిసి మెలసి ఉందామని పాలబాస తీసుకుంటారు.

స్వామి ఉత్సవ వివరాలిలా...

- ఈ నెల 7న సోమవారం నెరణికి గ్రామంలో ఉంటున్న మాళ మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తులను దేవరగట్టుకు తీసుకెళ్లి రాత్రి కంకణధారణ నిర్వహిస్తారు.
- దసరాను పురస్కరించుకుని ఈ నెల12న శనివారం కల్యాణోత్సవం, బన్ని,జైత్రయాత్ర
- 13వ తేది భవిష్యవాణి (దైవవాణి)
- 14వ తేది సాయంత్రం స్వామివారి రథోత్సవం నిర్వహిస్తారు.
- 15న గొరవయ్యల ఆటలు, గొలుసు తెంపుట, సాయంత్రం దేవదాసీల క్రీడోత్సవం ఉంటుంది.
- 16న మాళమల్లేశ్వర స్వామి విగ్రహాలు నెరణికి గ్రామానికి చేరడంతో ఉత్సవాలు ముగుస్తాయి.


మాళ మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తులు

దసరా రోజు వేడుకలకు దూరం ...

విజయదశమి అందరికీ పండుగా అయితే ఆ మూడు గ్రామస్తులకు మాత్రం ఉండదు. దసరా బన్ని ఉత్సవాలు ముగిసి విగ్రహాలు నెరణికి గ్రామానికి చేరే రోజు విజయానికి సూచికగా వారు పండుగ చేసుకుంటారు. ఈ కట్టుబాట్లను కులమత భేదాలు లేకుండా ఆయా గ్రామాల్లోని అన్ని వర్గాల ప్రజలు పాటిస్తూ బన్ని ఉత్సవంలో భాగస్వాములవుతారు.

విగ్రహాల రక్షణే మా లక్ష్యం


వేలాది మంది పాల్గొనే వేడుకల్లో జాగ్రత్తగా విగ్రహాలను కాపాడుకోవడమే మా మూడు గ్రామాల లక్ష్యం. కఠోర కట్టుబాట్లతో ఉండంతోనే జైత్రయాత్రలో విగ్రహాలకు దెబ్బలు తగలకుండా చూసుకోగలుగుతున్నాం. విగ్రహాలను కై వశం చేసుకోవడానికి అడ్డు పడ్డారనేది అవాస్తవం. విగ్రహాలను కర్రలతో తాకి మొక్కు తీర్చుకోవడానికి భ క్తులు ముందుకు రాగ కర్రలు ఒకదానికొకటి తగిలి శబ్దం వస్తా యి. అయితే, చూసే వారికి కర్రలతో కొట్టుకుంటున్నట్లు కనబడుతుంది. – బసవరాజు, రాక్షస గుండ్లకు రక్తం ఇచ్చే గొరువయ్య, కంఛాభీరా వంశస్తుడు, నెరణికి

నిష్ఠతో కట్టుబాట్లను పాటిస్తారు


ఉత్సవాల్లో భాగంగా నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులు 15 రోజుల పాటు దీక్ష చేపడుతారు.ఈ సమయంలో మద్యం,మాంసం ముడితే బన్ని ఉత్సవం జరిపే అర్హత కోల్పోతారు. అందుకే చాలా నిష్ఠతో దీక్షలు, పూజలు చేస్తారు.బన్ని రోజు రెండుసార్లు స్నానం చేస్తారు.సాయంత్రం గట్టుకెళ్లే ముందు ప్రతి ఒక్కరు తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుంటారు.ఏ ఒక్కరు మద్యం తాగరు, మాంసం ముట్ట రు. ఎవరైనా తాగి కర్రలతో విగ్రహాల దగ్గరకు వస్తే వారిని కట్టడి చేస్తాం. – రవిశాస్త్రి, మాళమల్లేశ్వరునికి కల్యాణం జరిపే పురోహితుడు, నెరణికి

దీక్షలతో మాలో తెలియని శక్తి


నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తుల దీక్ష కారణంగా ఏటా విగ్రహాలను రక్షించుకుంటున్నాం. విగ్రహాల చుట్టు ఉన్న వారు అన్ని వేళల్లో జాగ్రత్తగా ఉంటారు. చురుకుగా వ్యవహరిస్తారు. దీంతో విగ్రహాల దగ్గరకు వచ్చిన వారి నుంచి ఎలాంటి ఇబ్బందులు కలగకుండ దేవుళ్లను ముందుకు తీసుకెళ్తారు. దీక్షలో ఉండడం వల్ల తెలియని శక్తి మాలో ప్రవేశిస్తుందని నమ్మకం. అందుకే ఏటా స్వామి కరుణతో బన్ని ఉత్సవాన్ని విజయవంతంగా పూర్తి చేస్తాం. – వీరనాగప్ప, నెరణికి గ్రామపెద్ద

క్లుప్తంగా

తోటి విద్యార్థినికి చేయూత


విద్యార్థిని హెబ్సీబాకు ఆర్థిక సాయంతో పాటు బుక్స్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

పెద్దకడబూరు: అగ్ని ప్రమాద బాధితురాలికి తోటి విద్యార్థులు చేయూతనిచ్చారు. బుక్స్, స్కూల్ యూనిఫాం, బ్యాగ్ తదితరవాటితో పాటు రూ. 6,800 నగదు అందజేశారు. గత నెల 25వ తేదీ విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో మండల కేంద్రం పెద్దకడబూరులో శాంతిరాజు అనే వ్యక్తి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఈయన మనువరాలు హెబ్సీబా స్థానిక ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. ఈ బాలికకు సంబంధించిన పుస్తకాలు, యూనిఫాం తదితరవన్నీ ఆ ప్రమాదంలో కాలిబూడిదయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు చెరి కొంత నగదును పోగుచేశారు. మంగళవారం ఉపాధ్యాయులతో కలిసి ఆ విద్యార్థినికి అందించారు.

కుమారస్వామికి పూజలు


అలంకరణలో కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. తర్వాత స్వామికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

వేల్పనూరులో భారీ చోరీ

● 16 తులాలు బంగారు, 30 వేల నగదు అపహరణ


వివరాలు సేకరిస్తున్న సీఐ సురేష్ కుమార్ రెడ్డి

వెలుగోడు: మండల పరిధిలోని వేల్పనూరు గ్రామంలోని ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన ఆమంచి వెంకటేశ్వర్లు పురోహితం చేస్తుంటాడు. ఈయన గత నెల 27వ తేదీన ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి కర్నూలుకు వెళ్లాడు. తిరిగి 30వ తేదీ రాత్రి ఇంటికి వచ్చారు. అప్పటికే ఇంటి తాళం తెరిచి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని 16 తులాల బంగారు, 30 వేల నగదు కనిపించలేదు. దొంగతన జరిగిందని నిర్ధారించుకుని మంగళవారం ఉదయం వెలుగోడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సి.ఐ సురేష్ కుమార్ రెడ్డి, ఏఎస్‌ఐ షాషావలి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతి


కర్నూలు: స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని సుశ్రుత భవన్ షెడ్డు వద్ద గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. ఆసుపత్రి సిబ్బంది గుర్తించి మూడవ పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. మహిళ వయస్సు 40 – 50 ఏళ్ల మధ్య ఉండొచ్చని తెలుస్తోంది. 5 అడుగుల ఎత్తు, ఛామన ఛాయ రంగు ఉంది. ఆరెంజ్, బ్రౌన్ కలర్ పూల డిజైన్ గల టాప్ ధరించింది. విషయం తెలిసిన వెంటనే మూడవ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఎవరూ సరైన సమాధానం తెలపకపోవడంతో మృతదేహాన్ని ఆసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. మృతురాలి ఆచూకీ తెలిసినవారు 91211 01061, 08518–277187 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని సీఐ మురళీధర్ రెడ్డి కోరారు.

పాఠశాలలో తేనె టీగల దాడి

● 15 మంది విద్యార్థులు, ముగ్గురు ఉపాధ్యాయులకు గాయాలు


గాయపడిన విద్యార్థులు

పాములపాడు: స్థానిక ఏఎస్‌ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తేనెటీగల దాడిలో 15 మంది విద్యార్థులు, ముగ్గురు ఉపాధ్యాయులు గాయపడిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. విరామ సమయంలో విద్యార్థులు మూత్ర విసర్జనకు గ్రౌండ్‌లోని ట్యాంకు వైపునకు వెళ్లారు. అదే సమయంలో తేనెటీగలు లేయడంతో విద్యార్థులు తరగతి గదుల వైపు పరుగులు తీశారు. అదే సమయంలో గ్రౌండ్‌లో ఉన్న ఉపాధ్యాయులు రవి, రామక్రిష్ణ, రాంప్రసాద్‌లతో పాటు విద్యార్థులపై తేనెటీగలు దాడి చేశాయి. వీరందరినీ వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లి చికిత్స చేయించారు.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

నంద్యాల(రూరల్): స్థానిక రైల్వే స్టేషన్‌లో మంగళవారం తెల్లవారుజామున ఓ గూడ్స్ రైలు పట్టాలు తప్పంది. అయితే, ఎలాంటి ప్రమాదం జరగలేదు. నంద్యాల రైల్వే స్టేషన్‌లో మొత్తం 6 ప్లాట్ ఫాంలు ఉంటాయి. వాటిలో 5, 6 ప్లాట్ ఫాంలకు గూడ్స్ రైలు వస్తుంటాయి. మంగళవారం తెల్లవారుజామున వచ్చిన గూడ్స్ రైలులో 4,5 బోగీలు పట్టాలు తప్పాయి. గమనించిన రైల్వే అధికారులు వెంటనే సరిజేసి సమస్యను పరిష్కరించారు. దీనిపై స్టేషన్ మేనేజర్ దొరస్వామి వివరణ కోరగా గూడ్స్ రైలు పట్టాలు తప్పిన విషయం వాస్తవమేనని, అయితే, ఎలాంటి ప్రమాదం లేదని తెలిపారు.

మార్కెట్‌కు పోటెత్తుతున్న ఉల్లి!

● తాజాగా 11,502 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు రాక
● వ్యాపారుల సిండికేట్‌తో నష్టపోతున్న రైతులు


ఉల్లి తూకాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఉల్లి పోటెత్తుతోంది. ధరలు తగ్గుతాయనే భయంతో రైతులు హడావుడిగా ఉల్లిగడ్డలను కోసి తెస్తున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఉల్లి వస్తుండటంతో గోదాములు, షెడ్లు, మాదవాచారి షెడ్లు పూర్తిగా నిండిపోయాయి. సోమవారం రికార్డు స్థాయిలో 12,611 క్వింటాళ్ల ఉల్లిగడ్డలు మార్కెట్‌కు వచ్చాయి. ఇవి మార్కెట్ నుంచి బయటకు వెళ్లకముందే మంగళవారం 362 మంది రైతులు 11,502 క్వింటాళ్లు తెచ్చారు. దీంతో మార్కెట్‌లో ఉల్లి ఘాటు పెరిగిపోయింది. మరోవైపు ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమైంది. ఉల్లి గరిష్ట ధర స్వల్పంగా పెరిగినప్పటికి సగటు ధర పడిపోయింది. సగటు ధరను బట్టి చూస్తే వ్యాపారులు సిండికేట్ అయినట్లు తెలుస్తోంది. క్వింటాలుకు కనిష్టంగా రూ.319, గరిష్టంగా రూ.3,769 లభించింది. సగటు ధర రూ.2,067 మాత్రమే నమోదైంది. సగటు ధరను పరిశీలిస్తే ఎక్కువ మంది రైతులకు ధర రూ.1500 నుంచి రూ.2,200 వరకు మాత్రమే లభిస్తోంది. రైతులను ఆకర్షించి మార్కెట్‌కు మరింత ఉల్లి రప్పించేందుకు వ్యాపారులు ఒకటి రెండు చిన్నలాట్లకు ఎక్కువ ధర కోట్ చేస్తారు. దీనిని నమ్మి వచ్చిన రైతులకు మార్కెట్‌లో చుక్కలు కనిపిస్తున్నాయి. సెప్టెంబరు 30న గరిష్ట ధర రూ.3660 లభించినప్పటికి సగటు ధర రూ.2,218 నమోదైంది. మార్కెట్‌లో ఉల్లి వ్యాపారులు దాదాపు 40 మంది వరకు ఉన్నారు. వీరిలో భారీగా ఉల్లి కొనుగోలు చేసేది కొంతమంది మాత్రమే. వీరే సిండికేట్‌గా మారి ఉల్లి రైతులకు తీరని దగా చేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

కోర్టు చొరవతో నిందితుల విడుదల

కర్నూలు (లీగల్): పలు చోరీ కేసులతో సంబంధం ఉందనే అనుమానంతో 3వ పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని నిర్బంధించిన ఇద్దరు నిందితులు కోర్టు జోక్యంతో సోమవారం రాత్రి విడుదల య్యారు. స్థానిక శరీన్‌నగర్‌కు చెందిన బాలకృష్ణ, మహేష్ అనే ఇద్దరు అనుమానితులను కొద్ది రోజుల క్రితం మూడవ పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచలేదు. దీంతో వారి బంధువులు న్యాయవాది ద్వారా స్థానిక ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ ముందు సెర్చ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు మెజిస్ట్రేట్ బాధితుల స్టేట్‌మెంట్లను రికార్డు చేసి ఒక అడ్వకేటు కమిషనర్‌ను నియమించింది. దాంతో అడ్వకేటు కమిషనర్ సోమవారం రాత్రి మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అనుమానితుల గురించి వాకబు చేశారు. స్టేషన్‌లో ఇద్దరు నిందితులు ఉండటంతో వారిని పోలీసులు అడ్వకేటు కమిషనర్‌కు అప్పగించారు. ఆ తర్వాత ఆయన ఇద్దరు నిందితులను కోర్టులో హాజరుపర్చగా వారిని విడుదల చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. దీంతో ఇద్దరు నిందితులు విడుదలయ్యారు.

ఆగని విధ్వంసం

● శిలాఫలకాలపై పచ్చమూకల అక్కసు
● తాజాగా మరో రెండు శిలా ఫలకాలు ధ్వంసం


పేరాయిపల్లె ప్రధాన రహదారిలో ధ్వంసమైన శిలాఫలకం

ఆళ్లగడ్డ: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నియోజకవర్గంలో పచ్చ మూకల విధ్వంసం కొనసాగుతూనే ఉంది. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన అభివృద్ధి పనుల శిలాఫలకాలను ధ్వంసం చేస్తూ పైశాచికానందం పొందుతున్నారు. రెండు రోజుల క్రితం అహోబిలంలో శిలాఫలకాన్ని కూల్చిన ఘటన మరువక ముందే తాజాగా పేరాయిపల్లె గ్రామంలో ఆదివారం రాత్రి రెండు శిలాఫలకాలను ధ్వంసం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామంలో ప్రధాన రహదారిలో, దర్గా సమీపంలో వేసిన సీసీ రోడ్లు ప్రారంభించే సమయంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి చిత్రాలు, పేర్లతో రెండు శిలాఫలకాలను ఏర్పాటు చేశారు. వీటిని రోజూ చూస్తూ జీర్ణించుకోలేని టీడీపీకి చెందిన దుండగులు ధ్వంసం చేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పచ్చని పల్లెల్లో ఇలాంటి చిల్లరచేష్టలతో గొడవలు చెలరేగి ఫ్యాక్షన్‌కు దారితీసే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పట్టించుకోని పోలీసులు, అధికారులు

ఒకటి కాదు రెండు కాదు పదుల సంఖ్యలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నా.. పోలీసులు, పంచాయతీ రాజ్ అధికారులు ఇంత వరకు ఒక్కరిపైనా కూడా చర్యలు తీసుకోలేదు. ధ్వంసం అవుతున్న శిలాఫలకాలు ప్రభుత్వ ఆస్తి. ప్రభుత్వ నిధులతో నిర్మించినవి. ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం అవుతున్నా పంచాయతీ అధికారులు స్పందించక పోవడం, పోలీసులు చర్యలు తీసుకోక పోవడంపై

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య


మృతి చెందిన రైతు మద్దిలేటి

నందికొట్కూరు: అప్పుల బాధ తాళలేక కొణిదేల గ్రామానికి చెందిన రైతు మద్దిలేటి (36) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మూడు ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న, మినుము పంటలు సరైన దిగుబడి రాకపోవడంతో మద్దిలేటి అప్పుల ఊబిలో కూరకపోయాడు. పంటల పెట్టుబడి కోసం చేసిన అప్పులకు వడ్డీలు పెరిగి రూ. 7 లక్షలకు చేరింది. అప్పుల బాధ భరించలేక సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని మృతి చెందాడు. కుటుంబీకుల సమాచారంతో పోలీసులు చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య సుగుణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ గనమల సుబ్బారావు మంగళవారం తెలిపారు.

క్రీడలతో మానసిక వికాసం


టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న వీసీ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: క్రీడలు మానసిక వికాసానికి దోహదం చేస్తాయని రాయలసీమ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ అన్నారు. విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల విద్యార్థుల కబడ్డీ పోటీలు మంగళవారం వర్సిటీ ప్రాంగణంలోని గ్రౌండ్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. వీసీ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించి విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. జిల్లా క్రీడల అధికారి బి.భూపతి మాట్లాడుతూ శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. క్రీడాకారులకు వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ పి.శివకిషోర్ స్వాగతం పలికారు. రెండు రోజుల పాటు సాగే ఈ పోటీల్లో మొత్తం 16 జట్లు పాల్గొంటున్నట్లు చెప్పారు. వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ పి.మార్తయ్య, డాక్టర్ జి.చంద్రశేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణాలకు తాళం

● మరో పది రోజుల నిర్వహణకు ప్రైవేటు సైన్యం


కర్నూలులో ప్రభుత్వ దుకాణం మూసివేసి నిరసన తెలుపుతున్న సూపర్‌వైజర్లు

కర్నూలు: ప్రభుత్వ మద్యం దుకాణాలకు తాళాలు వేసి సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు ఆందోళనబాట పట్టారు. దుకాణాల్లో పనిచేసే సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్ల ఒప్పందం సోమవారంతో ముగిసింది. నూతన మద్యం పాలసీ ఈనెల 12న అమలులోకి రానున్నందున సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరుతూ మంగళవారం జిల్లాలోని అన్ని మద్యం దుకాణాలకు తాళాలు వేసి నిరసన తెలియజేశారు. కర్నూలు జిల్లాలో 96 మద్యం దుకాణాలు ఉండగా కేవలం రెండు దుకాణాల్లో మాత్రమే వ్యాపార లావాదేవీలు జరిగాయి. ఒక్కొక్క దుకాణంలో రోజుకు కనీసం రూ.2 లక్షలకు పైగా వ్యాపారం సాగేది. సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లు దుకాణాలకు తాళాలు వేసి విధులకు గైర్హాజరు కావడంతో దాదాపు కర్నూలు జిల్లాలో రూ.2 కోట్ల ఆదాయం కోల్పోయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మద్యం వ్యాపారుల (ప్రైవేటు వ్యక్తులు) వద్ద పనిచేసిన వర్కర్స్ చేత ఈనెల 11వ తేదీ వరకు ప్రభుత్వ మద్యం దుకాణాల నిర్వహణను కొనసాగించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు పాత సిండికేట్‌లో ఉన్న మద్యం వ్యాపారులకు ఫోన్లు చేసి దుకాణాల నిర్వహణకు రోజువారీ వేతనం కింద వర్కర్లను పంపాలని అధికారులు కోరినట్లు సమాచారం.

తక్కువ ధరలతో బీఎస్ఎన్ఎల్ నాణ్యమైన సేవలు


ర్యాలీలో బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ రమేష్, ఉద్యోగులు

కర్నూలు(హాస్పిటల్): అతి తక్కువ ధరల్లో బీఎస్ఎన్ఎల్ నాణ్యమైన సేవలు అందిస్తోందని ఆ సంస్థ బ్రాంచ్ జనరల్ మేనేజర్ రమేష్ తెలిపారు. బీఎస్ఎన్ఎల్ 25వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం కర్నూలు నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతితక్కువ ధరకే అత్యధిక స్పీడు, ఓటీటీ సర్వీసులను అందించేందుకు బీఎస్ఎన్ఎల్ సరికొత్త ప్లాన్ ఎప్పటికప్పుడు ప్రవేశపెడుతోందన్నారు. ఫైబర్ నెట్ యూజర్ల కోసం 18004444 వాట్సాప్ చాట్ బోట్ ప్రారంభించామని, ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీఎస్ఎన్ఎల్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని డ్రాయింగ్ పోటీలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించామన్నారు. ఇందులో 2,100 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. మొదటి విజేత సిస్టర్స్‌స్టానిస్లాస్ స్కూల్ ఐదవ తరగతి విద్యార్థి ఎం.సహస్ర, రెండోబహుమతి డోన్ పట్టణంలోని శ్రీ సుధా హైస్కూల్ విద్యార్థిని పి.శ్రీకృతి, మూడో బహుమతి శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థి కె.జితేష్ గెలుచుకున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.రాజేశ్వరరావు, ఐఎఫ్ఏడీ శ్రీలత, ఏజీఎం అడ్మిన్ వి.శ్రీనునాయక్, ఏజీఎం(డోన్), జి.నారాయణస్వామి, ఏజీఎం మొబైల్ ఇన్‌స్టాలేషన్ జీవీ మురళీకృష్ణ, ఏజీఎం ప్లానింగ్ వి.జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి విద్యార్థి దుర్మరణం

● మరో ఇద్దరికి తీవ్రగాయాలు


మృతిచెందిన ఇజ్రాయెల్


ప్రమాదానికి గురైన బైక్

కర్నూలు: కర్నూలు మండలం పసుపుల గ్రామానికి చెందిన రాజు కుమారుడు కలపాగు ఇజ్రాయెల్ (17) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఇజ్రాయెల్ స్థానిక బీటీ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మరో ఇద్దరు స్నేహితులతో కలిసి జగన్నాథగట్టుపైకి ఫొటోషూట్ కోసం వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. దిన్నెదేవరపాడు రస్తా నుంచి కార్బైడ్ ఫ్యాక్టరీ సమీపంలోని ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ వద్ద మలుపులో వాహనం అదుపు చేసుకోలేక వేగంగా వెళ్లి చెట్టుకు ఢీకొట్టడంతో ఇజ్రాయెల్ అక్కడికక్కడే మృతిచెందగా స్నేహితులిద్దరికీ కాళ్లు, చేతులు విరిగాయి. ప్రమాదంలో మృతిచెందిన ఇజ్రాయెల్ కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి సమీప బంధువు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. మృతుని బంధువులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని విలపించడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. తీవ్ర గాయాలకు గురైన ఇద్దరు విద్యార్థుల పేర్లు తెలియాల్సి ఉంది. వారు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు ప్రాథమికంగా సమాచారాన్ని సేకరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

బండిఆత్మకూరు: ఎర్రగుంట్ల గ్రామ సమీపంలో కేసీ కెనాల్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు బండిఆత్మకూరు ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. మృతదేహం పూర్తిగా గుర్తు పట్టలేని స్థితిలో ఉందని, మృతుడు ఎరుపు, నలుపు గళ్ల చొక్కా ధరించాడని, చొక్కాపై నందికొట్కూరుకు చెందిన ఉస్మాన్ టైలర్ అనే లేబుల్ ఉందన్నారు. మూడు రోజుల క్రితమే మరణించినట్లుగా డాక్టర్లు ధ్రువీకరించారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకీ తెలిసిన వారు 9121101094ను సంప్రదించాలన్నారు.